సాక్షి నారాయణపేట

శుక్రవారం । 17 । అక్టోబర్ । 2025



హైవేపై దారి మళ్లింపు

శ్రీశైలంలో ప్రధాని మోదీ పర్యటన కారణంగా జాతీయ రహదారి నుంచి ప్రత్యామ్నాయ మార్గాలకు వాహనాలు మళ్లించారు.

-IIలో ▸



అభివృద్ధికి ప్రణాళికలు

అలంపూర్‌లో పర్యాటక అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు కేంద్ర పురావస్తు శాఖ సూపరింటెండెంట్ నిఖిల్‌దాస్ తెలిపారు.

-IIలో ▸

గరిష్టం/కనిష్టం 32.7/19.5

వాతావరణం

ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఉంటుంది. సాయంత్రం జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

'రెవెన్యూ' దరఖాస్తుల పరిశీలన వేగవంతం



మాగనూర్: రెవెన్యూ దరఖాస్తుల పరిశీలన త్వరగతిన పూర్తి చేయాలని అడిషనల్ కలెక్టర్ శ్రీను ఆదేశించారు.మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని అడిషనల్ కలెక్టర్ పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలని తహసీల్దార్ సురేష్‌కుమార్‌కు సూచించారు. అనంతరం కార్యాలయ రికార్డులను, కంప్యూటర్, రికార్డుల గది, రిజిస్ట్రేషన్ల గదిని పరిశీలించారు. కార్యాలయ సిబ్బందికి పలు సలహాలు సూచనలు ఇచ్చారు.

నేడు వాలీబాల్ జట్టు ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని డీఎస్‌ఏ స్టేడియంలో శుక్రవారం ఉమ్మడి జిల్లా అండర్-19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వాలీబాల్ జట్టు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ శారదాబాయి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఒరిజినల్ మెమో, బోనోఫైడ్‌తో ఉదయం 9 గంటలకు ఎంపికలకు హాజరుకావాలని ఆమె కోరారు.

19న ఉమ్మడి జిల్లా ఖోఖో జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: కల్వకుర్తి పట్టణంలో ఈనెల 19న ఉదయం 9 గంటలకు ఉమ్మడి జిల్లా ఖోఖో సీనియర్ పురుషుల, మహిళా జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా ఖోఖో సంఘం ప్రధాన కార్యదర్శి జీఏ విలియం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లిలో వచ్చేనెల 6 నుంచి 8వ తేదీ వరకు రాష్ట్రస్థాయి సీనియర్ ఖోఖో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఎంపికల్లో పాల్గొనేవారు ఒరిజినల్ ఆధార్‌కార్డుతో హాజరుకావాలని, మిగతా వివరాల కోసం సీనియర్ క్రీడాకారుడు రాజు (9985022847) నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

యోగాసన క్రీడాజట్ల ఎంపికలు

ఉమ్మడి జిల్లా యోగాసన సబ్ జూనియర్, జూనియర్ విభాగాల బాల, బాలికల జట్ల ఎంపికలను ఈనెల 19వ తేదీన ఉదయం 9 గంటలకు జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా యోగాసన క్రీడా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె.రాములు, ఆర్.బాల్‌రాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 8-10, 10-12, 12-14, 14-16, 16-18 ఏళ్లలోపు క్రీడాకారుల ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. క్రీడాకారులు బోనఫైడ్ సర్టిఫికెట్, ఒరిజినల్ ఆధార్‌కార్డుతో ఎంపికలకు హాజరుకావాలని కోరారు. మిగతా వివరాల కోసం 9440292044 నంబర్‌కు సంప్రదించాలని వారు సూచించారు.

ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాలోని బాలానగర్, దేవరకద్ర, రాంరెడ్డి గూడెం, జడ్చర్ల, నంచర్ల గురుకులాల్లో 5 నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కోఆర్డినేటర్ వాణిశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. టీజీసెట్ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందని, ఈనెల 18 లోగా ఆయా గురుకులల్లో తమ దరఖాస్తులను సమర్పించాలని సూచించారు.

మొక్కజొన్న @ రూ.2,075

జడ్చర్ల/దేవరకద్ర: బాదేపల్లిలోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు గురువారం వివిధ ప్రాంతాల నుంచి 2,812 క్వింటాళ్ల మొక్కజొన్న విక్రయానికి వచ్చింది. క్వింటాల్ గరిష్టంగా రూ.2,075, కనిష్టంగా రూ.1,601 ధరలు లభించాయి. దేవరకద్ర మార్కెట్‌లో ఆముదాలు క్వింటాల్‌కు గరిష్టంగా రూ.5,709, కనిష్టంగా రూ.5,629గా ధరలు లభించాయి. హంస ధాన్యం క్వింటాల్‌కు గరిష్టంగా రూ.1,789గా ఒకే ధర పలికింది.

రిటైర్మెంట్ బెనిఫిట్స్ వెంటనే విడుదల చేయాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను తక్షణమే విడుదల చేయాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రకాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆ సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రిటైర్డ్ ఉపాధ్యాయుడు కొండయ్యకు రావాల్సిన రిటైర్మెంట్ బకాయిల్లో రూ.9 లక్షలు వెంటనే తన అకౌంట్‌లో జమ చేసినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. పదవీ విరమణ చేసిన అనేకమంది రిటైర్మెంట్ లాభాలు, గ్రాట్యుటీ, పింఛన్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, జీపీఎఫ్ బెనిఫిట్లను అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

పట్టాలెక్కిన ఆనందం

పీయూలో కనులపండువగా స్నాతకోత్సవం



వేదికపై గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, వీసీ శ్రీనివాస్, పారిశ్రామిక వేత్త మన్నె సత్యనారాయణ రెడ్డి

- మన్నె సత్యనారాయణరెడ్డికి గౌరవ డాక్టరేట్ ప్రదానం
- మరో 83 మందికి గోల్డ్‌మెడల్స్, 12 మందికి పీహెచ్‌డీల బహూకరణ
- పీయూ మరింత అభివృద్ధి చెంది, నాణ్యమైన విద్య అందించాలి: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- ఆడిటోరియం నిర్మాణానికి రూ.12 కోట్లు ప్రకటించిన ఎంఎస్ఎన్ రెడ్డి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ 4వ స్నాతకోత్సవ కార్యక్రమం గురువారం కనులపండువగా జరిగింది. ఉదయం 11 గంటలకు కార్యక్రమం ప్రారంభం కాగా.. పీయూ లైబ్రరీ ఆడిటోరియం వద్ద గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆడిటోరియం హాల్‌లో ఈసీ మెంబర్స్ సమావేశంలో పాల్గొని.. స్నాతకోత్సవం జరిగే లైబ్రరీ ఆడిటోరియంలోకి వచ్చారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరైన మన్నె సత్యనారాయణరెడ్డికి వీసీ శ్రీనివాస్ యూనివర్సిటీ చాన్స్‌లర్, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అనుమతితో గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆ తర్వాత గోల్డ్‌మెడల్స్ స్వీకరిస్తున్న విద్యార్థులు, పీహెచ్‌డీ అవార్డులు అందుకోనున్న విద్యార్థులతో ప్రమాణం చేయించారు. ముందుగా పీహెచ్‌డీ పూర్తిచేసిన 12 మందికి అవార్డులు, డాక్టరేట్, తర్వాత యూజీ, పీజీలో టాపర్లుగా నిలిచిన వారికి గోల్డ్‌మెడల్స్ అందించారు.



స్నాతకోత్సవంలో బంగారు పతకాలు, డాక్టరేట్లు అందుకున్న పీయూ విద్యార్థులు

యూనివర్సిటీ మరింత అభివృద్ధి

వీసీ శ్రీనివాస్ మాట్లాడుతూ పాలమూరు యూనివర్సిటీ ఒక సాధారణ పీజీ కళాశాలగా ప్రారంభమై 2008లో పూర్తిస్థాయిలో యూనివర్సిటీగా అవతరించి ప్రతి సంవత్సరం మరింత అభివృద్ధిని సాధిస్తుందని పేర్కొన్నారు. 171 ఎకరాల్లో ఉన్న యూనివర్సిటీలో మహబూబ్‌నగర్‌లోని యూనివర్సిటీలో 5 కళాశాలలు ఉండగా గద్వాల, కొల్లాపూర్, వనపర్తిలో పీజీ సెంటర్లు కొనసాగుతున్నాయన్నారు. ప్రారంభంలో కేవలం 5 కోర్సులతో ప్రారంభమైన యూనిర్సిటీ ఇప్పుడు 24 కోర్సులు అందుబాటులోకి వచ్చాయన్నారు. కొత్తగా ఇంజినీరింగ్, లా కళాశాలలు ప్రారంభించి నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఎఫ్‌సెట్ ద్వారా లా లో మొత్తం 100 శాతం (ఎల్ఎల్‌బీలో 60, ఎల్ఎల్ఎంలో 20) సీట్లు భర్తీ చేశామన్నారు. రీసెర్చ్‌లో 9 సబ్జెక్టులు ఉండగా.. 12 మందికి డాక్టరేట్ పట్టాలు అందిస్తున్నామని, మరో 25 మంది రీసెర్చ్‌లో ఉన్నారన్నారు. యూజీ, పీజీ స్థాయిలో సీబీసీఎస్ (చాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టం) అమలు పరుస్తున్నామని, ఇప్పటి వరకు 50 సెమినార్లు, 7 రోజులు ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. మూక్స్, స్వయం పోర్టల్స్‌లో ఇప్పటికే 2 వేలకుపైగా విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు.

పూర్తిస్థాయిలో వసతులు..

పీయూలో విద్యార్థులకు పూర్తిస్థాయిలో వసతులు కల్పిస్తున్నామని, హాస్టళ్లు, లైబ్రరీ, స్పోర్ట్స్, ల్యాబ్స్ వంటి సౌకర్యాలు ఉన్నాయని వీసీ అన్నారు. నూతనంగా రూ.13.2 కోట్లతో రీసెర్చ్ ఫెసిలిటీ భవనం నిర్మాణం జరుగుతుందని, రూ.35 కోట్లతో ఇంజినీరింగ్ కళాశాల, రూ.15 కోట్లతో లా కళాశాల నిర్మాణానికి అనుమతులు వచ్చాయన్నారు. ఇటీవల కొత్త బాలికల హాస్టల్ ప్రారంభించామని, ఇందులో 300 మంది విద్యార్థులకు వసతులు కల్పిస్తున్నామన్నారు. రూ.5 కోట్లతో సీవేజ్ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్మిస్తున్నామన్నారు. పీఎం ఉషా స్కీం ద్వారా రూ.100 కోట్ల నిధులు వచ్చాయని, ఎస్ఈపీలో భాగంగా సమర్థ్ పోర్టల్‌ను ఉపయోస్తూ అడ్మినిస్ట్రేషన్ పరమైన మార్పులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. పీయూలో 70 శాతం ఈకో ఫ్రెండ్లీ వాతావరణం, గ్రీనరీ ఉండటం వల్ల విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు.

విలువలు పెంపొందించుకోవాలి

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ యూనివర్సిటీలో చదువుకున్న విద్యార్థులు సమాజానికి టార్చ్‌బేరర్‌గా నిలవాలని, సమాజాన్ని, దేశాన్ని మార్చేందుకు తమవంతు కృషి చేయాలన్నారు. స్నాతకోత్సవం అనేది కేవలం పట్టాల ప్రదానోత్సవం మాత్రమే కాదని.. అది విద్యార్థి కృషి, ఉపాధ్యాయుల సేవ, తల్లిదండ్రుల త్యాగాలను స్మరించుకునే సందర్భం అన్నారు. విద్య యొక్క అసలు లక్ష్యం ఉద్యోగం పొందడమే కాదని.. అది వ్యక్తిత్వం, విలువలు, జీవన నైపుణ్యాలను అభివృద్ధి చేయడం అన్నారు. పీయూలో చాలా అభివృద్ధి జరిగిందని, ఇక్కడ చేస్తున్న అనేక కార్యక్రమాలు ఆకర్షణీయంగా ఉన్నాయన్నారు. ముఖ్యంగా మిలియన్ ట్రీ ప్లాంటేషన్, యూనివర్సిటీ విద్యార్థులు గ్రామాలను దత్తత తీసుకోవడం, కనెక్ట్ విత్ చాన్స్‌లర్ వంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. తెలంగాణలో ఏ యూనివర్సిటీ సాధించలేని విధంగా పీయూ పీఎం ఉషా స్కీం ద్వారా రూ.100 కోట్లు సాధించడం ఒక మైలురాయిగా నిలుస్తుందన్నారు. యూనివర్సిటీ ఈ సంవత్సరం న్యాక్ రెండోసారి వెళ్లడం మంచి పరిణామం అని, ఉన్నత విద్యకు కృషి చేసే యూనివర్సిటీలు ఆధునిక దేవాలయాలుగా నిలుస్తున్నాయన్నారు. ఇలాంటి యూనివర్సిటీలు రీసెర్చ్, ఇంక్యూబేషన్ సెంటర్‌లుగా మారి విద్యార్థుల ద్వారా కొత్త స్టార్టప్‌లు ఏర్పాటు కోసం కృషి చేయాలన్నారు.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు..

పీయూలో ఇటీవల లా, ఇంజినీరింగ్ కళాశాలలు ఏర్పాటు చేయడం శుభపరిణామం అని గవర్నర్ అన్నారు. ఇంజినీరింగ్‌లో డాటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషన్ లర్నింగ్ వంటి ఆధునిక కోర్సులు ప్రారంభించిన మొదటి సంవత్సరంలో 100 శాతం అడ్మిషన్లు సాధించడం అభినందిచదగ్గ విషయమన్నారు. ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎంలో ఇంటలెక్చువల్ ప్రాపర్టీ సబ్జెక్టులతో ఇక్కడి విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా మారుతుందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ-2020తో విద్యార్థులకు చదువుతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వచ్చేందుకు ఎంతో దోహదపడుతుందని తెలిపారు. స్నాతకోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించిన వీసీ శ్రీనివాస్, రిజిస్ట్రార్ రమేష్‌బాబు అభినందించారు.

గొప్ప గౌరవం..

ఈ నేలలో పుటిన బిడ్డగా పాలమూరు యూనివర్సిటీ వేదికపై మాట్లాడేందుకు అవకాశం ఇవ్వడాన్ని గొప్ప గౌరవంగా భావిస్తున్నట్లు ఎంఎస్ఎన్‌రెడ్డి అన్నారు. ఒకప్పుడు వలసల జిల్లాగా ఉన్న పాలమూరు ఇప్పుడు విద్య, ఆరోగ్యం, పరిశ్రమ రంగాల్లో ఎంతో అభివృద్ధి సాధిస్తుందన్నారు. విద్యార్థుల విజయం కేవలం వ్యక్తిగత పురోగతితో కాదని, సమాజానికి తిరిగి ఇచ్చే సేవతో కొలవాలని పేర్కొన్నారు. పీయూ బ్రాండ్ అంబాసిడర్, నిజాయితీ, కరుణ, ధైర్యం వారి యొక్క లక్ష్యంగా మారాలన్నారు. విద్యార్థుల సాంకేతికత పరిశోధనలను, ఆవిష్కరణలు సమాజానికి ఉపయోగపడేలా ఉండాలని, సేవా దృక్పథంతో పనిచేసి దేశాభివృద్ధికి కృషి చేయాలన్నారు.

రూ.12 కోట్ల విరాళం

స్నాతకోత్సవం పూర్తయిన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడుతూ పాలమూరు యూనివర్సిటీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, పీయూలో ఆడిటోరియం నిర్మాణానికి రూ.12 కోట్లు విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించారు.

సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడొచ్చు



సీపీఆర్‌పై శిక్షణ ఇస్తున్న ఎంఐసీయూ డాక్టర్ రఘురెడ్డి.. చిత్రంలో కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట: గుండెపోటుకు గురైన వ్యక్తులకు సకాలంలో సీపీఆర్ చేసి ప్రాణాలను కాపాడవచ్చని, సీపీఆర్ విధానంపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లాలోని అన్ని లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులకు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో వైద్యాధికారులకు ఎంఎల్‌హెచ్‌పీలకు సీపీఆర్‌పై వేర్వేరుగా శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన శిక్షణ కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ సీపీఆర్ చేయడం, నేర్చుకోవడం వల్ల గుండెపోటుతో కారణంగా ఆగిపోయిన గుండెల్లో రక్తప్రసరణను మళ్లీ పెంపొందించడానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ శిక్షణను ఉపయోగించుకోవాలని సూచించారు. సీపీఆర్ చేయడం నేర్చుకొని సగటు వ్యక్తి ప్రాణాన్ని కాపాడడానికి కృషి చేయాలని ఆరోగ్య శాఖలోని సిబ్బంది మాత్రమే కాకుండా సగటు మనిషి ఎవరైనా దీన్ని నేర్చుకోవచ్చని చెప్పారు. మహబూబ్‌నగర్ నుంచి వచ్చిన ఎంఐసీయూ డాక్టర్ రఘురెడ్డి సిపిఆర్‌పై శిక్షణ ఇచ్చారు. అలాగే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో వైద్యాధికారులు పర్యవేక్షకులకు, ఎంఎల్‌హెచ్‌పిలకు సిపిఆర్ పై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ జయచంద్ర మోహన్, ప్రోగ్రామ్ అధికారి సత్య ప్రకాష్, ఎన్‌సీడి కోఆర్డినేటర్ విజయ్ కుమార్, అరవింద్ కుమార్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

టపాసుల విక్రయాలకు అనుమతులు తప్పనిసరి

నారాయణపేట: దీపావళి పండుగ సందర్భంగా జిల్లాలో టపాసులు విక్రయించే యజమానులు తెలంగాణ ఎక్స్‌ప్లోజివ్ యాక్ట్ 1884, రూల్స్ 2008 ప్రకారం అనుమతులు (లైసెన్సులు) తీసుకోవడం తప్పనిసరి అని జిల్లా ఎస్పీ వినీత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టపాసుల విక్రయ దుకాణాలు రద్దీ ప్రదేశాలు, ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ప్రాంతాలు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు లేదా పెట్రోల్ బంకులు సమీపంలో అలాగే వివాదాస్పద స్థలాల్లో ఏర్పాటు చేయరాదని సూచించారు. సంబంధిత తహసీల్దార్, ఫైర్ విభాగం, పోలీసు శాఖ సూచించిన ప్రదేశాల్లో మాత్రమే లైసెన్స్ ఉన్న వ్యాపారులు షాపులు నిర్వహించాలని పేర్కొన్నారు. లైసెన్స్ గడువు ముగిసిన వారు ముందస్తుగా పర్మిషన్/రిన్యూవల్ తీసుకొని మాత్రమే టపాసులు విక్రయించాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. జిల్లా ప్రజలు భద్రతా నియమాలు పాటిస్తూ, పిల్లలను పెద్దల పర్యవేక్షణలో టపాసులు కాల్చేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

నార్కోటిక్ డ్రగ్స్ తయారు చేస్తే చర్యలు

పాలమూరు: ఉమ్మడి జిల్లాలో ఏదైనా ప్రాంతాల్లో కానీ, ఇళ్లు, ఫ్యాక్టరీలలో నార్కోటిక్ డ్రగ్స్, సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ వంటి డ్రగ్స్ తయారీ కార్యకలాపాలు ఉంటే టోల్ ఫ్రీ నం.18005996969తో పాటు ఆయా జిల్లాల డ్రగ్ ఇన్‌స్పెక్టర్లకు సమాచారం ఇవ్వాలని జిల్లా ఔషధ నియంత్రణ శాఖ ఏడీ దినేష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మీ ఏరియాల్లో అనుమానాస్పదంగా కనిపించినా, ఎవరైనా వ్యక్తులు డ్రగ్ విక్రయాలు చేస్తున్నట్లు తెలిసిన వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇలాంటి చట్ట విరుద్ధ కార్యకలాపాలను గుర్తిస్తే నకిలీ, నాణ్యత లేని మందులను మార్కెట్‌లోకి రాకుండా నివారించవచ్చని చెప్పారు.

ఎట్టకేలకు..!



మక్తల్ పెద్ద చెరువు మినీ ట్యాంక్‌బండ్‌ను పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

- నేడు చేప పిల్లల పంపిణీని ప్రారంభించనున్న మంత్రులు
- జిల్లాలో 1.82 కోట్ల చేపలు వదలాలని లక్ష్యం
- వానాకాలం ముగియనుండడంతో సగమే విడుదల చేయనున్న వైనం
- జిల్లాలో 146 మత్స్య పారిశ్రామిక సంఘాలు.. 11,039 మంది సభ్యులు



నారాయణపేట: మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతంగా చేసేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఉచిత చేపపిల్లల పంపిణీకి ఎట్టకేలకు శ్రీకారం చుట్టింది. వర్షాకాలం ముగుస్తున్న ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మత్స్యకారులకు మత్స్యశాఖ తీపి కబురు అందించింది. శుక్రవారం ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమ అభివృద్ధి, క్రీడలు, యువజన సేవల మంత్రి వాకిటి శ్రీహరి తన నియోజకవర్గంలోని సంగంబండ రిజర్వాయర్, మక్తల్ పెద్ద చెరువులో చేప పిల్లలను వదలనున్నారు. సెప్టెంబర్ చివరి వారంలో చేప పిల్లల పంపిణీ చేపట్టాలనుకున్నా ఎన్నికల కోడ్ అమలులోకి రావడం.. ఆ తర్వాత బీసీ రిజర్వేషన్‌పై హైకోర్టులో స్టే ఇవ్వడంతో ఎన్నికల షెడ్యూల్, నోటిఫికేషన్‌ను రద్దు చేయడంతో ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రారంభోత్సవాలకు అవకాశం కలిగినట్లయింది. జిల్లాలో 13 మండలాల పరిధిలో 146 మత్స్య పారిశ్రామిక సంఘాలు.. 11,039 మంది సభ్యులు ఉన్నారు. సొసైటీల అధ్వర్యంలో చేపపిల్లలను పెంచి సభ్యులందరూ జీవనోపాధి పొందుతున్నారు.

మూడు రిజర్వాయర్లు.. 642 చెరువులు

జిల్లాలో 3 రిజర్వాయర్లు, 642 - చెరువులు, కుంటలు ఉన్నాయి. అయితే జిల్లా వ్యాప్తంగా 1.82 కోట్ల చేప పిల్లలను వదలాలని ప్రభుత్వం ముందు లక్ష్యం నిర్దేశించగా సమయం మించిపోవడంతో గతేడాది మాదిరిగానే ఈ సారి సగమే సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టారు. 35-40 ఎంఎం చేప పిల్లలను సరఫరా చేస్తే లాభం లేదని భావించిన మత్స్యశాఖ 80-100 ఎంఎం చేప పిల్లలను వదిలేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇదిలాఉండగా, జిల్లాలోని మక్తల్ నియోజకవర్గంలోని పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల్లో మంత్రులు వాకిటి శ్రీహరి, దమోదర రాజనర్సింహ పాల్గొననున్నారు. ఈమేరకు ఉదయం 9 గంటలకు సంగబండ రిజర్వాయర్‌లో, 10 గంటలకు మక్తల్ పెద్ద చెరువులో చేప పిల్లలను వదలనున్నారు. ఇందుకుగాను అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు



వర్కూర్ శివారులో ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న మైనింగ్ ఆర్ఐ ప్రతాప్‌రెడ్డి

మాగనూర్: ఇసుక రీచ్ యాజమానులు వాల్టా చట్టాన్ని అనుసరిస్తూ కూలీల సహాయంతో ఇసుక తరలించాలని, ఎట్టి పరిస్థితుల్లో కూడా వాగులో ఇటాచీ, జేసీబీలను వినియోగించవద్దని, ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే చట్ట పరమైన చర్యలతో పాటు రీచ్ అనుమతులు రద్దు చేయబడతాయని మైనింగ్ ఆర్ఐ ప్రతాప్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని వర్కూర్, మాగనూర్ శివారులో ప్రభుత్వ అనుమతులతో నడుస్తున్న ఆన్‌లైన్ ఇసుక రీచ్‌లను ఆయన తనిఖీ చేశారు. కొందరు ప్రభుత్వ అనుమతులను బేఖాతారు చేస్తూ యంత్రాల సహాయంతో ఇసుక తరలిస్తున్నట్లు సీఎంఓకు ఫిర్యాదు అందిందని తెలిపారు. ఈమేరకు రీచ్‌లను పరిశీలించడం జరిగిందన్నారు. అయితే ఇక్కడ కొన్ని రీచ్‌లకు దుబ్బ ఇసుక అనుమతులు ఉండటంతో పాటు ఈ మధ్య కురిసిన వర్షాల కారణంగా వాగులో నీటి ప్రవాహంతో రోడ్డు ధ్వంసం అవడంతో యంత్రాలను పనుల నిమిత్తం వినియోగించినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఎట్టి పరిస్థితుల్లో వాల్టా చట్టాన్ని అనుసరించాలని ఆదేశించారు. ఆయన వెంట టీజీఎండీసీ ఎస్ఆర్‌వో శివారెడ్డి, మాగనూర్ ఎస్ఆర్‌ఏలు నర్సింహ, మనోజ్ ఉన్నారు.

ఉత్సాహంగా చదరంగం పోటీలు



చెస్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన చెస్ పోటీలు విజయవంతం అయ్యాయి. 69వ ఎస్‌జీఎఫ్ క్రీడల్లో భాగంగా జిల్లా స్థాయి అండర్ -14, అండర్ -17 బాలబాలికల చదరంగ పోటీలు పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలకు చెందిన 120మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటాపోటీగా ఎత్తులకు పైఎత్తులు వేస్తూ పలువురు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చరు. అండర్ -14 బాలికల విభాగం నుంచి ఐదుగురు, బాలుర విభాగం నుంచి ఐదుగురు, అండర్- 17 లో బాలికలు, బాలుర నుంచి ఐదుగురు చొప్పున ఎంపికయ్యారు. వీరు ఈనెల 18న వనపర్తిలో జరిగే ఉమ్మడి మహబూబ్‌నగర్ స్థాయి పోటీలో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ జీ ఎఫ్ మాజీ సెక్రెటరీ నర్సిములు, పిడిలు రత్నయ్య, కథలప్ప, బాలరాజ్, వెంకటేష్, రామకృష్ణరెడ్డి, అక్తర్, పర్వీన్, అనంత సేన, కృష్ణవేణి పిఈటిలు బసంత్ రెడ్డి, రాజేష్, చక్రి, మోహన్ పాల్గొన్నారు.

మిగిలింది.. 48 గంటలే

- మద్యం దుకాణాల టెండర్ల దాఖలుకు రేపటితో ముగియనున్న గడువు
- ఉమ్మడి జిల్లాలోని 227 షాపులకు 1,211 దరఖాస్తులు
- ఫీజుల రూపంలో ప్రభుత్వానికి రూ.34.53 కోట్ల ఆదాయం

మహబూబ్‌నగర్ క్రైం: ఉమ్మడి జిల్లాలో ఉన్న 227 ఏ4 మద్యం దుకాణాలకు దరఖాస్తులు స్వీకరించడానికి మరో 48 గంటల సమయం మాత్రమే ఉంది. అ యితే ఇప్పటి వరకు ఆశించిన స్థాయిలో టెండర్లు దాఖలు కాకపోవడంతో ఎక్సైజ్ అధికారులు తీవ్ర ని రాశలో ఉన్నారు. గురువారం ఉమ్మ డి జిల్లా వ్యాప్తంగా 542టెండర్లు దాఖలు కాగా.. ఇందులో మహబూబ్‌నగర్ జిల్లాలో అత్యధికంగా 144 వచ్చాయి. ఇక వనపర్తి జిల్లాలో మ ద్యం వ్యాపారులు ఏమాత్రం ఆసక్తి చూపడం లేదు. ఇప్పటి వరకు 34 దుకాణాలకు కేవలం 120 టెండర్లు మాత్రమే వచ్చాయి. ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు 1,211 దరఖాస్తులు రాగా.. వీటి ద్వారా ప్రభుత్వానికి రూ.34.53 కోట్ల ఆదాయం సమకూరింది. మిగిలిన రెండు రోజుల్లో ఏ స్థా యిలో టెండర్లు వస్తాయనే ఆందోళనలో అధికారులున్నారు. గత రెండేళ్ల కిందట స్వీకరించిన దర ఖాస్తుల్లో చివరి మూడు రోజుల్లో భారీగా పెరిగినా.. ఈసారి మాత్రం ఆ పరిస్థితి కనిపించడం లేదు.

ఉమ్మడి జిల్లా పరిధిలో ఇలా..

జిల్లా	గురువారం వచ్చినవి	మొత్తం టెండర్లు	ఆదాయం (రూ.కోట్లలో..)
మహబూబ్‌నగర్	144	396	11.88
నాగర్‌కర్నూల్	125	256	7.68
జోగులాంబ గద్వాల	103	233	6.99
నారాయణపేట	110	206	6.18
వనపర్తి	60	120	1.80

క్లుప్తంగా

మద్యం మత్తులో కిందపడి వ్యక్తి మృతి


రవీంద్రగౌడ్ (ఫైల్)

గోపాల్‌పేట: మద్యానికి బానిసైన వ్యక్తి రోడ్డు పక్కన పడి మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. గోపాల్‌పేట ఎస్‌ఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాలు.. బుద్దారం గ్రామానికి చెందిన ముచ్చుమారు రవీంద్రగౌడ్(43) కొన్నేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో గోపాల్‌పేటకు వచ్చి ఏదుట్ల వెళ్లే దారిలో రోడ్డు పక్కన మద్యం మత్తులో పడి మృతి చెందాడు. గమనించిన స్థానికులు గోపాల్‌పేట ఎస్‌ఐకి సమాచారం ఇవ్వగా ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు ఆరా తీయగా. రవీంద్రగౌడ్‌గా నిర్ధారించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడి భార్య భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

యువకుడి మృతదేహం లభ్యం


పృథ్వీ (ఫైల్ ఫొటో)

బిజినేపల్లి: నాగార్జునసాగర్ బ్యాక్ వాటర్‌లో గల్లంతైన మండలంలోని ఖానాపూర్ గ్రామానికి చెందిన పృథ్వీ (26) మృతదేహం గురువారం మధ్యాహ్నం లభ్యమైంది. వివరాల్లోకి వెళ్తే ఖానాపూర్ గ్రామానికి చెందిన పృథ్వీతో పాటు మరో నలుగురు యువకులు మంగళవారం నాగార్జునసాగర్ బ్యాక్ వాటర్‌లో బోటింగ్‌కు వెళ్లారు. బోటింగ్ చేసే సమయంలో పృథ్వీ ప్రమాదశావత్తు జారీ నీటిలో పడిపోయాడు. వెంట వచ్చిన మిత్రులు స్థానిక పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం యువకుడి మృతదేహం లభ్యం కాగా కుటుంబ సభ్యులకు అప్పగించారు. యువకుడి తల్లిదండ్రులు బోటింగ్ యజమానిపై ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

చెరువులో పడి వ్యక్తి మృతి


మృతుడు శేఖర్

మద్దూరు: చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ విజయ్‌కుమార్ కథనం మేరకు.. జచ్చర్లకు చెందిన కమ్మరి శేఖర్(45) కుటుంబంతో కలిసి మద్దూరులోని రవి పాతఇనుప సామాన్ల దుకాణంలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 12న ఉదయం సమయంలో కాలకృత్యాలకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికిన అచూకీ లభించ లేదు. గురువారం ఉదయం 11 గంటలకు మద్దూరు శివారులోని సంఘం చెరువులో మృతదేహం తేలుతుండటంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు, మున్సిపల్ సిబ్బంది మృతదేహాన్ని బయటకు తీసి విచారణ చేయగా మృతుడి భార్య లక్ష్మి తన భర్త శేఖర్‌గా గుర్తించింది. ఫిట్స్ ఉండడం వల్లే చెరువులో పడి మృతి చెంది ఉంటాడని మృతుడి భార్య తెలపడంతో ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. మృతుడికి ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి


కదిరె లక్ష్మమ్మ (ఫైల్)

ఖిల్లాఘనపురం: విషద్రావకం తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఓ మహిళ బుధవారం చికిత్స పొందుతూ మృతి చెందింది. ఖిల్లాఘనపురం మండలం పర్వతాపురానికి చెందిన కదిరె లక్ష్మమ్మ (45) ఈ నెల 12న కడుపునొప్పి భరించలేక క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం వనపర్తి జిల్లా ఆస్పత్రి అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో లక్ష్మమ్మ బుధవారం మరణించింది. మృతురాలి కుమారుడు కదిరె కుర్మయ్య గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటేశ్ తెలిపారు.

కడుపు నొప్పి భరించలేక మహిళ ఆత్మహత్య

హన్వాడ: కడుపు నొప్పి భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన కథనం మేరకు వివరాలు మండల పరిధిలోని కొత్తపేట గ్రామానికి చెందిన చింతకాయల సత్యమ్మ(75) కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతుంది. నొప్పి భరించలేక ఈనెల 15న ఇంట్లోనే పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గుర్తించిన కుటుంబీకులు వెంటనే చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో బుధవారం మరణించింది. భర్త వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు.

చెంచుల అభ్యున్నతికి పథకాలు


గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు జ్ఞాపిక అందజేస్తున్న కలెక్టర్ విజయేందిర.. చిత్రంలో గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్, ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, డీఐజీ చౌహాన్, ఎస్పీ జానకి తదితరులు

- క్షయ రహిత దేశంగా తీర్చిదిద్దడంలో కళాకారులు, రచయితలు భాగస్వాములు కావాలి
- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఆదివాసీ చెంచుల సమగ్ర, సర్వతోముఖాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు జిల్లాలో ఉన్న 1,441 మంది లబ్ధిదారులకు చేరాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కోరారు. గురువారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అధికారులు, వివిధ రంగాల ప్రముఖులతో నిర్వహించిన ముఖాముఖిలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్వయం ఉపాధి, సౌర విద్యుత్, పక్కా ఇళ్లు, విద్య తదితర పథకాలు చెంచులకు అందేలా చూడాలన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో క్షయ పరీక్షలు నిర్వహించి వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యం అందించాలని, క్షయ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని సూచించారు. సామాజిక కార్యకర్తలు, ప్రముఖులు, రచయితలు, కవులు, కళాకారులు వీధి నాటకాలు, జానపద గేయాలు, రచనలతో మూఢ నమ్మకాలు, సామాజిక రుగ్మతలను పారద్రోలడానికి తమవంతు కృషి చేయాలన్నారు. చెంచులు, ఆదివాసీ మహిళలను మహిళా సంఘాల్లో చేర్చుకొని వారి ఆర్థిక స్వావలంబనకు తోడ్పడాలని కోరారు. అంతకుముందు కలెక్టర్ విజయేందిర బోయి మహబూబ్‌నగర్ జిల్లా విశిష్టత, ప్రముఖ పర్యాటక స్థలాలు, విద్య, వైద్యం, వివిధ శాఖల్లో సాధించిన అభివృద్ధిని పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. విద్య, వైద్యం, క్రీడలు, రచనలు, సేంద్రియ సాగు, సామాజిక సేవ తదితర రంగాల్లోని 16 మంది ప్రముఖులు ఆయా రంగాల్లో చేసిన సేవలను తెలియజేశారు.

గవర్నర్‌కు ఘన స్వాగతం..

కలెక్టరేట్‌కు చేరుకున్న గవర్నర్‌కు కలెక్టర్ విజయేందిర బోయి, అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మధుసూదన్‌నాయక్ స్వాగతం పలకగా పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించిన అనంతరం గ్రామీణాభివృద్ధి, వైద్య, మెప్మా, రెడ్‌క్రాస్ సొసైటీ, మహిళా, శిశుసంక్షేమ తదితర శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను గవర్నర్ తిలకించారు. చెంచుల ఆరోగ్య పరీక్షల నిర్వహణకుగాను ప్రధానమంత్రి జన్‌జాతి ఆదివాసీ న్యాయమహా అభియాన్ కింద సంచార వైద్య వాహనాన్ని గవర్నర్ జెండా ఊపి ప్రారంభించారు.

మొక్క నాటిన గవర్నర్..

కలెక్టరేట్ ఆవరణలో గవర్నర్ మొక్కనాటి నీరు పోశారు. పచ్చదనంతో పర్యావరణానికి మేలు చేకూరుతుందని.. మొక్కలను సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి, గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ దానకిషోర్, డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, ఎస్పీ డి.జానకి వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.


స్టాళ్లను తిలకిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ


విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

కుటుంబసభ్యుల సహకారంతో..



కుటుంబ సభ్యుల సహకారంతో ఎంఈడీ పూర్తి చేశా. చదువుపై పూర్తిస్థాయిలో దృష్టి సారించడంతో యూనివర్సిటీ టాపర్‌గా నిలిచా. స్నాతకోత్సవంలో బంగారు పతకం అందుకున్నందుకు చాలా సంతోషంగా ఉంది. కళాశాల యాజమాన్యం సైతం ఎంతో సహకరించింది. – శ్వేత, ఎంఈడీ

అధ్యాపకులు సహకరించారు..



బీఈడీలో మంచి మార్కులు సాధించేందుకు కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, తల్లిదండ్రులు సహకరించారు. రోజు చెప్పిన అంశాలను రివిజన్ చేసుకోవడం, ప్రత్యేక మెటీరియల్‌తో ప్రిపేర్ కావడంతో మంచి మార్కులు సాధించి యూనివర్సిటీ టాపర్‌గా నిలిచా. బంగారు పతకం అందుకున్నందుకు ఆనందంగా ఉంది. – పి.చందన, బీఈడీ

సంతోషంగా ఉంది..



నేను కల్వకుర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివా.. అధ్యాపకులు ఎంతో సహకరించారు. సబ్జెక్టుల్లోని సందేహాలు నివృత్తి చేసేవారు. క్రమం తప్పకుండా కళాశాలకు వెళ్లడంతో పాఠ్యాంశాలపై పట్టుసాధించా. మంచి మార్కులు సాధించేందుకు అవకాశం లభించింది. తల్లిదండ్రులు కూడా ఎంతో సహకరించారు. – చంద్రిక, బీబీఏ

శాస్త్రవేత్తగా రాణించాలన్నదే లక్ష్యం..



పీయూలో ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ పూర్తి చేసి యూనివర్సిటీ టాపర్‌గా నిలిచా. స్నాతకోత్సవంలో గోల్డ్‌మెడల్ తీసుకోవడం ఆనందంగా ఉంది. ప్రస్తుతం ఐఐసీటీ హైదరాబాద్‌లో పీహెచ్‌డీ చేస్తున్నా. జీవితంలో శాస్త్రవేత్తగా స్థిరపడాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్నా. లక్ష్యాన్ని చేరుకునేందుకు భార్య స్వాతి, తల్లిదండ్రులు ఎంతో సహకరించారు. – గణేష్, ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ

పర్యావరణ పరిరక్షణపై పరిశోధన..



పీయూ మైక్రో బయాలజీ విభాగంలో సూక్ష్మజీవుల సహకారంతో పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై పరిశోధన చేశా. పరిశోధన కోసం అధ్యాపకుడు మధుసూదన్‌రెడ్డి ఎంతో సహకరించారు. స్నాతకోత్సవంలో కుటుంబ సభ్యులతో కలిసి డాక్టరేట్ అందుకోవడం సంతోషంగా ఉంది. భవిష్యత్‌లో సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు చేస్తా. – విజయ్‌కుమార్, పీహెచ్‌డీ (మైక్రో బయాలజీ)

గర్వంగా ఉంది..



అమ్మానాన్నలు చిన్నప్పటి నుంచి చదువుకునేందుకు ప్రోత్సహించారు. మోడల్ స్కూల్‌లో ఇంటర్ వరకు ఉపాధ్యాయులు చక్కటి సహకారం అందించారు. ఎంకాం చేయాలన్న కోరిక నన్ను ముందుకు నడిపించింది. యూనివర్సిటీలో ప్రొఫెసర్ల సహకారం, చదవాలన్న ఆకాంక్ష గోల్డ్ మెడల్ సాధించేందుకు సహకరించింది. గవర్నర్ చేతుల మీదుగా గోల్డ్‌మెడల్ అందుకుంటానని కలలో కూడా ఊహించలేదు. చాలా గర్వంగా, ఆనందంగా ఉంది. – రమ్య, ఎంకాం

హైవేపై దారి మళ్లింపు

- కర్నూలులో ప్రధాని మోదీ పర్యటన
- తెలంగాణ సరిహద్దులో ట్రాఫిక్ ఆంక్షలు
- జాతీయరహదారిపై నిలిచిన వాహనాలు
- దారి మళ్లించే ప్రాంతాల్లో ఏపీ పోలీసులు


అలంపూర్ చౌరస్తాలో వాహనాలను దారి మళ్లిస్తున్న సీఐ రవిబాబు, పోలీసులు

అలంపూర్/మానవపాడు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూల్ జిల్లాలో గురువారం ప్రధాని మోదీ పర్యటన కారణంగా జాతీయ రహదారి నుంచి ప్రత్యామ్నాయ మార్గాలకు వాహనాలను మళ్లించారు. పోలీసులు సూచించిన రోడ్డు మార్గాల ద్వారా వాహనదారులు తమ గమ్యస్థానాలకు తరలివెళ్లారు. కర్నూల్ జిల్లాలో పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపనలు చేయడంతో పాటు ప్రధాని భారీ బహిరంగ సభలో పాల్గొనందున అక్కడ ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. దీంతో సరిహద్దు ప్రాంతమైన అలంపూర్ నియోజకవర్గంలో ఈ పరిస్థితి రోజంతా కొనసాగింది. దీంతో అలంపూర్, అలంపూర్ చౌరస్తా, శాంతినగర్, అయిజ వంటి ప్రాంతాలు వాహనాలతో రద్దీగా మారాయి. అలంపూర్ సీఐ రవిబాబు, ఉండవెల్లి ఎస్‌ఐ శేఖర్, అలంపూర్ ఎస్‌ఐ వెంకటస్వామి ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను దారి మళ్లించి, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా పర్యవేక్షించారు. అలంపూర్ చౌరస్తాలోని జాతీయ రహదారి ఫ్లైఓవర్ వద్ద ఏపీకి చెందిన సీఐ, పోలీసులు సైతం ట్రాఫిక్ మళ్లింపులో భాగస్వాములయ్యారు. ఉదయం నుంచి ఒక్కసారిగా వచ్చిన వాహనాలతో ఫ్లైఓవర్, జాతీయ రహదారిలో రద్దీ ఏర్పడింది. వాహనదారులు ఇబ్బందులు పడకుండా దారి మళ్లించే ప్రదేశాల్లో ఆయా ప్రాంతాల పేర్లు, గుర్తులతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అయితే మొదట్లో ఏపీ పోలీసులు లారీ వంటి వాహనాలతో పాటు కార్లను సైతం దారి మళ్లించారు. దీంతో జాతీయరహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. సీఐ రవిబాబు ఇక్కడికి చేరుకొని కార్ల లాంటి చిన్న వాహనాలను నేరుగా జాతీయరహదారి గుండా వెళ్లడానికి అవకాశం కల్పించారు. దీంతో ట్రాఫిక్ సమస్య సద్దుమణిగింది.


మానవపాడు స్టేజీ వద్ద జాతీయ రహదారిపై నిలిచిన భారీ వాహనాలు

భారీ వాహనాల నిలిపివేత

కర్నూల్ జిల్లాలోని నన్నూరులో ప్రధాని భారీ బహిరంగ సభ నేపథ్యంలో మానవపాడు స్టేజీ సమీపంలో జాతీయ రహదారి-44పై భారీ వాహనాలను పోలీసులు నిలిపివేశారు. దీంతో బెంగుళూరు, అనంతపురం, హిందూపురం, పుట్టపర్తికి వెళ్లే వాహనాదారులు ఇబ్బందులు పడ్డారు.

దారి మళ్లిన వాహనాలు

- కడప నుంచి కర్నూల్ మీదుగా హైదరాబాద్ వెళ్లాల్సిన వాహనాలను పాణ్యం, గడివేముల, మిడ్తూరు, బ్రాహ్మణకొట్కూరు, కొల్లబాపురం, పూడూరు, అలంపూర్, అలంపూర్ చౌరస్తా మీదుగా హైదరాబాద్‌కు చేరుకున్నాయి.
- ఆత్మకూరు నుంచి బళ్లారి వైపు వెళ్లాల్సిన వాహనాలు ఆత్మకూరు, బ్రాహ్మణకొట్కూరు, కొల్లబాపురం, పూడూరు, ఆలంపూర్, ఆలంపూర్ చౌరస్తా, శాంతినగర్ మీదుగా బళ్లారికి దారి మళ్లించారు.
- అనంతపురం నుంచి హైదరాబాద్ వెళ్లాల్సిన వాహనాలను గుత్తి, జొన్నగిరి, తుగ్గలి, పత్తికొండ, ఆస్పరి, ఆదోని, ఎమ్మిగనూరు, నందవరం, నాగలదిన్నె, అయిజ మీదుగా దారి మళ్లించారు.
- బళ్లారి నుంచి హైదరాబాదు వైపు వెళ్లాల్సిన వాహనాలు ఆదోని, సిరిగుప్ప చెక్‌పోస్టు, ఆదోని, ఎమ్మిగనూరు, నందవరం, నాగలదిన్నె, అయిజ, శాంతినగర్ మీదుగా వెళ్లాయి.
- ఓర్వకల్లు నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు కర్నూల్ ఎల్లమ్మ గుడి, పడిదెంపాడు, పూడూరు, ర్యాలంపాడు, అలంపూరు మీదుగా అలంపూర్ చౌరస్తా ద్వారా రాకపోకలు సాగించాయి. ఇలా భారీ వాహనాల రాకపోకలతో ఈ ప్రాంతం రద్దీగా మారడంతో కొన్ని చోట్ల ట్రాఫిక్ నిలిచిపోయి నిరీక్షించాల్సి వచ్చింది.

ఈగలపెంట వద్ద..


ఈగలపెంటలో ట్రాఫిక్ నియంత్రిస్తున్న డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి

దోమలపెంట: ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటన సందర్భంగా గురువారం ఉదయం ఎనిమిది గంటల నుంచి ఎస్‌పీజీ అధికారుల ఆదేశాల మేరకు విజయవాడ డీఎస్పీ వి.వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏపీ పోలీసులు ఈగలపెంటలో ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగించారు. ఆర్టీసీ బస్సులు, ఇతరత్రా వాహనాలన్నింటిని జెన్‌కో గ్రౌండ్‌లోకి మళ్లించి అక్కడే నిలిపివేశారు. సరిగ్గా మధ్యాహ్నం రెండు గంటల సమయంలో సున్నిపెంట నుంచి ప్రధానమంత్రి హెలికాప్టర్‌లో బయలుదేరిన తర్వాత వాహనాల రాకపోకలు కొనసాగించారు. ఈగలపెంట ఎస్‌ఐ జయన్న ఆధ్వర్యంలో స్థానిక పోలీసులు ఏపీ పోలీసులకు సహకరించారు.

పర్యాటక అభివృద్ధికి ప్రణాళికలు


పాపనాశిని ఆలయాల్లో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న పురాతత్వ శాఖ సూపరింటెండెంట్ నిఖిల్‌దాస్

అలంపూర్: పురావస్తు శాఖ ఆధ్వర్యంలో పర్యాటక అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు కేంద్ర పురావస్తు శాఖ సూపరింటెండెంట్ నిఖిల్‌దాస్ తెలిపారు. అలంపూర్ పట్టణంలోని పాపనాశిని ఆలయాల్లో గార్డెన్ పనులను గురువారం కేంద్ర పురావస్తు శాఖ సూపరింటెండెంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అలంపూర్ ఆలయాల సముదాయాన్ని కేంద్ర పురావస్తు శాఖ, హైదరాబాద్ ఆధ్వర్యంలో రూ.50 లక్షలతో అభివృద్ధికి చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. మొదటి విడతలో భాగంగా రూ. 20 లక్షలతో పను లు ప్రారంభించామని తెలిపారు. పాపనాశిని, సంగమేశ్వర ఆలయాల ప్రాముఖ్యత భక్తులకు, పర్యాటకుల తెలిసే విధంగా ప్రచార చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జోగుళాంబ అమ్మవారి 5వ శక్తి పీఠ క్షేత్రం కావడంతో కేంద్ర ప్రభుత్వం ప్రసాద్ స్కీంలో భాగంగా అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు.

ఆలయాల సందర్శన

అలంపూర్ క్షేత్రంలో వెలిసిన జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి వారి ఆలయాలను కేంద్ర పురాతత్వ శాఖ సూపరింటెండెంట్ నిఖిల్‌దాస్ గురువారం దర్శించుకున్నారు. అనంతరం ఆయన ఈఓ దీప్తితో కలిసి ఆలయాల్లో చేపట్టాల్సిన పనులను పరిశీలించారు. వీరితో పాటు కేంద్ర పురాతత్వ శాఖ కన్సర్వేషన్ అసిస్టెంట్ వెంకటయ్య, సిబ్బంది తదితరులు ఉన్నారు.

జూరాలకు 33వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

ధరూరు: జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 33 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. బుధవారం రాత్రి 9 గంటల వరకు ప్రాజెక్టుకు 24,600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. గురువారం సాయంత్రం 6 గంటల వరకు ఇన్‌ఫ్లో 33 వేల క్యూసెక్కులకు పెరిగింది. విద్యుదుత్పత్తికి 23,439 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 70 క్యూసెక్కులు, భీమా లిఫ్ట్-1కు 650 క్యూసెక్కులు, నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 1,030 క్యూసెక్కులు, కుడి కాల్వకు 700 క్యూసెక్కులు, భీమాలిఫ్ట్-2కు 750 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి 26,639 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ నీటిమట్టం 9.296 టీఎంసీలు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

శ్రీశైలంలో 883.0 అడుగుల నీటిమట్టం

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో 883.0 అడుగుల వద్ద 204.3520 టీఎంసీల నీటినిల్వ ఉంది. జూరాలలో విద్యుదుత్పత్తి చేస్తూ 31,213, సుంకేసుల నుంచి 4,560 మొత్తం 35,773 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం జలాశయానికి వస్తున్నాయి. విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. పోతిరెడ్డిపాడు ద్వారా 8,000, హెచ్ఎన్ఎస్ఎస్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 2,839, ఎంజీకేఎల్ఐకు 1,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 17.050 మిలియన్ యూనిట్లు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో 7.456 మి.యూనిట్ల విద్యుదుత్పత్తి చేశారు.

బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిద్దాం



కురుమూరిస్వామి బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

చిన్నచింతకుంట: కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలు, జాతర ఉత్సవాలు వైభవంగా నిర్వహిద్దామని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం చిన్నచింతకుంట మండలంలోని దమగ్నాపురంలో ఎమ్మెల్యే నివాసంలో కురుమూర్తి స్వామి ఆలయ పాలక మండలితో కలిసి స్వామి వారి బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం ఆలయం వద్ద కొనసాగుతున్న పనులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ సంవత్సరం కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు, జాతర ఉత్సవాలు వైభవంగా జరుపుకుందామన్నారు. అందుకు ఆలయం వద్ద పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఉత్సవాలకు తరలి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ మధనేశ్వరెడ్డి, పాలక మండలి సభ్యులు, తదితరులు ఉన్నారు.

అర్ధరాత్రి వరుస దొంగతనాలు

- సంగంబండలో చోరీ.. కొత్తగార్లపల్లిలో దొరికాడు
- దొంగకు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన గ్రామస్తులు


కొత్తగార్లపల్లిలో దొంగను పట్టుకొని కట్టేసిన దృశ్యం

మక్తల్: మండలంలో బుధవారం అర్ధరాత్రి దొంగలు వరుస చోరీకి పాల్పడ్డారు. సంగంబండ గ్రామంలో డబ్బా అంజప్ప ఇంట్లో రూ. 20 వేల నగదు 42 తులాల వెండి ఎత్తుకెళ్లగా, కొత్తగార్లపల్లి గ్రామంలో హరిజన అంజప్ప భార్య మెడలో పుస్తెలతాడు చోరీ జరిగినట్లు బాధితులు తెలిపారు. పూర్తి వివరాలు.. బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని నలుగురు దొంగలు సంగంబండలో చోరీ చేసి కొత్తగార్లపల్లిలో హరిజన్ అంజప్ప ఇంట్లో దొంగతనం చేస్తుండగా కుటుంబ సభ్యులు పట్టుకోబోయారు. ఈ నేపథ్యంలో దుండగుడు ఒకరు అంజప్ప తలపై దాడి చేశాడు. కుటుంబ సభ్యులు కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకొని దొంగను పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దొంగను మక్తల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నలుగురు వ్యక్తులు దొంగతనానికి వచ్చినట్లు బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ భాగ్యలక్ష్మిరెడ్డి తెలిపారు.


దొంగ దాడిలో గాయపడిన హరిజన్ అంజప్ప

సాక్షి ఫ్యామిలీ IV
మహబూబ్‌నగర్
శుక్రవారం ॥ 17-10-2025



రోజుకు 5 నుండి 7 గంటలు తలను ఫోన్ ముందు వంచి గడపడాన్ని 'టెక్స్ట్ నెక్' అని పిలుస్తున్నారు. టెక్స్ట్ నెక్ అనేది మెడలోని కండరాలు, నరాలను ఒత్తిడికి గురి చేస్తుంది. ఒక వ్యక్తి గంటల తరబడి ఫోన్ ముందు వంగి ఉండడం వల్ల అది వెన్నుపూసల మధ్య డిస్క్‌లపై మూడు నుంచి అయిదు రెట్లు ఎక్కువ ఒత్తిడి కలిగిస్తుందంటున్నారు వైద్యనిపుణులు.







- 'సాక్షి' ఫ్యామిలీతో మహిళా ఐపీఎస్‌ల మనోగతం

అమ్మ... నాన్న... నాలుగో సింహం

అణువంత ప్రోత్సాహంతో అంతులేనన్ని విజయాలు సాధిస్తామని నిరూపించారు. అపజయాలెన్ని ఎదురైనా వెరవకుండా లక్ష్యాన్ని సాధించి చూపారు. అమ్మానాన్నలు ఇచ్చిన ప్రోత్సాహం.. భరోసాతో దేశంలోనే అత్యున్నత సర్వీస్‌లలో ఒకటైన ఇండియన్ పోలీస్ సర్వీసెస్‌కు ఎంపికై శభాష్ అనిపించుకున్నారు. ఓ కూతురు కండక్టర్ అయిన తన తండ్రి కల నెరవేర్చితే... మరో కూతురు తన తండ్రి నుంచి పొందిన స్ఫూర్తితో సమాజ సేవకు సిద్ధమైంది. అమ్మ అండతో సాటి మహిళలకు భరోసాగా నిలిచే పోలీస్ అధికారి అవుతానని మరొకరు నిరూపించారు. నేషనల్ పోలీస్ అకాడమీలో విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న 174 మందిలో 77 ఆర్ఆర్ (రెగ్యులర్ రిక్రూటీస్) బ్యాచ్ ఐపీఎస్ అధికారులు నేడు నిర్వహించనున్న పాసింగ్ ఔట్‌పరేడ్‌తో బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా బ్యాచ్‌లోని ముగ్గురు మహిళా ఐపీఎస్‌ల మనోగతం... వారి మాటల్లోనే...

అమ్మ ఇచ్చిన భరోసాతోనే ముందుకు వెళ్లా!
- జయశర్మ

నేను ఐపీఎస్ అధికారి అయ్యానంటే అందుకు వందశాతం మా అమ్మే కారణం. నేను ఓటమి పాలైన ప్రతిసారి నాలో ధైర్యాన్ని నింపింది అమ్మ. ఒత్తిడిలో కూరుకుపోయిన ప్రతిసారీ నాకు భరోసా ఇచ్చి నన్ను ఇక్కడివరకు నడిపింది మా అమ్మ నీతూశర్మే. నా పేరు జయశర్మ. నా స్వస్థలం హర్యానాలోని హిస్సార్. మా నాన్న ప్రమోద్ కుమార్ శర్మ. నాన్న డిస్ట్రిక్ట్ ఫుడ్ సప్లై కంట్రోలర్‌గా పనిచేస్తున్నారు. అమ్మ గృహిణి. నేను ఢిల్లీ యూనివర్సిటీలో బీఎస్సీ మ్యాథ్స్ ఆనర్స్, ఐఐటీ ఢిల్లీ నుంచి ఎమ్మెస్సీ మ్యాథమెటిక్స్ పూర్తి చేశాను. నాకు ఐపీఎస్ కావాలని చిన్ననాటి నుంచే కల. అమ్మ ప్రోత్సాహం, నాన్న అండతో నేను గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన తర్వాత సివిల్ సర్వీసెస్‌పై దృష్టి పెట్టా. ఇది ఎంతో కష్టమైన పని. కొన్నిసార్లు మనపై మనం నమ్మకాన్ని కోల్పోతాం. ఇది మన వల్ల కాదనిపిస్తుంది. అలాంటప్పుడు మనల్ని ప్రోత్సహించేవాళ్లు, భరోసా ఇచ్చేవాళ్లు ఎంతో అవసరం. నేను కూడా మూడుసార్లు సివిల్స్‌కి ఎంపిక కాకపోయినా నిరుత్సాహ పడలేదు. తప్పులు సరిచేసుకుంటూ ముందు వెళ్లా. ఐపీఎస్ ఎలాగైనా సాధించాలన్న నా పట్టుదలకు తోడు నా కుటుంబం, స్నేహితులు అండగా నిలిచారు. నాల్గో ప్రయత్నంలో నేను అనుకున్నట్టుగానే ఐపీఎస్‌కి ఎంపికయ్యాను.

నేషనల్ పోలీస్ అకాడమీ (ఎన్‌పీఏ)లో శిక్షణ పూర్తిగా భిన్నమైంది. నేను ఎన్‌పీఏలోకి రాకముందు కనీసం వంద మీటర్లు కూడా పరిగెత్తినట్టు గుర్తు లేదు. కానీ ఇక్కడ శిక్షణతో ఇప్పుడు ఒంటిపై బరువు, చేతిలో రైఫిల్‌తో 40 కిలోమీటర్లు కూడా రన్నింగ్ చేసేంత స్థైర్యం వచ్చింది. మహిళా ఐపీఎస్ అధికారిగా మహిళా భద్రత, సైబర్ భద్రతపై ప్రత్యేక దృష్టి పెడతాను.

నాలుగుసార్లు ఓడినా.. నాన్న ప్రోత్సాహం తగ్గలేదు
- అశ్వని.ఎస్

మా స్వస్థలం తమిళనాడులోని కన్యాకుమారి. నాన్న బస్ కండక్టర్‌గా పనిచేసి ఈ ఏడాది రిటైర్ అయ్యారు. అమ్మ గృహిణి. మా అక్క ప్రైవేటు ఉద్యోగిని. మేం ఇద్దరమూ అమ్మాయిలమే అయినా.. నాన్న మమ్మల్ని అన్నింటిలో ప్రోత్సహించేవారు. నేను అన్నా యూనివర్సిటీ నుంచి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్‌లో ఇంజినీరింగ్ పూర్తి చేశాను. ప్రభుత్వ అధికారిగా ఉంటేనే సమాజానికి దగ్గరగా పనిచేయవచ్చని నాకు మొదటి నుంచి ఉండేది. అందుకే ఇంజినీరింగ్ తర్వాత ప్రైవేటు ఉద్యోగాలవైపు వెళ్లలేదు. తమిళనాడులో స్టేట్ జీఎస్టీ విభాగంలో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేశాను. కానీ.. నన్ను ఐపీఎస్ ఆఫీసర్‌ను చేయాలన్నది నాన్న కల. అయితే సివిల్స్‌కు ఎంపిక కావడం అంత సులువేం కాదు. ఐదో ప్రయత్నంలో ఐపీఎస్ సాధించానంటే నాన్న ఇచ్చిన ప్రోత్సాహమే కారణం. ఎప్పటికప్పుడు గతంలో చేసిన తప్పుల నుంచి పాఠాలు నేర్చుకుంటూ, వ్యక్తిగతంగా నోట్స్ తయారు చేసుకుంటూ నా ప్రయత్నాన్ని కొనసాగించాను. చివరికి విజయం దక్కింది. ఎన్నో కొత్త విషయాలను నేర్చుకునే అవకాశంతోపాటు మనలో ఉన్న సామర్థ్యాన్ని మనకు తెలియజేస్తుంది నేషనల్ పోలీస్ అకాడమీ ట్రైనింగ్. ఈ శిక్షణ తర్వాత నేను ఎంతో భరోసాగా చెప్పగలను – పోలీస్ ఉద్యోగం మహిళలు కూడా ఎంతో బాగా చేయగలరని! మా బ్యాచ్‌లో కూడా 65 మంది మహిళా ఐపీఎస్‌లు ఉండడమే అందుకు ఉదాహరణ. సివిల్స్‌కి ప్రిపేర్ అవుతున్న వాళ్లకి నా సలహా ఒక్కటే..సివిల్స్ సాధించడం అనేది మీ లక్ష్యం అయితే, ఎన్ని అడ్డంకులు వచ్చినా మధ్యలో వదలొద్దని ముందే నిర్ణయించుకోవాలి. ఒత్తిడి లేకుండా ప్రణాళిక ప్రకారం పరీక్షలకు సిద్ధం కావాలి. అప్పుడు విజయం మనదే.

నాకు స్ఫూర్తి మా నాన్నే
- కీర్తియాదవ్

నాన్న ఎయిర్‌మెన్‌గా ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో పని చేసి రిటైర్ అయ్యారు. ఇంట్లో ఎంతో క్రమశిక్షణ ఉండేది. నా చిన్నప్పటి నుంచి నాన్నను అలా యూనిఫాంలో చూస్తూ పెరగడంతో నాకు కూడా యూనిఫాం సర్వీసెస్ అంటే ఎంతో గౌరవం ఏర్పడింది. ఆయనే నాకు ఎప్పటికీ స్ఫూర్తి. స్కూలింగ్ పూర్తయి, కాలేజీకి వచ్చాక నాకు స్పష్టత వచ్చింది ఐపీఎస్ అధికారి అయితే ప్రజలకు నేరుగా సేవ చేసే అవకాశం ఉంటుందని. అందుకే ఎప్పటికైనా ఐపీఎస్ సాధించాలని లక్ష్యంగా పెట్టుకుని ముందుకు వెళ్లా. అయితే గ్జేవియర్స్ కాలేజ్ కోల్‌కతా నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తయి తర్వాత నేను మొదటి ప్రయత్నంలో సీఐఎస్ఎఫ్‌లో అసిస్టెంట్ కమాండెంట్‌గా ఎంపికయ్యాను. 2020లో ట్రైనింగ్ చేస్తూనే సివిల్స్ ప్రిపరేషన్ కొనసాగించాను. ఆ తర్వాత ఇండియన్ ఫారెస్ట్ సర్వీసెస్‌కు ఎంపికయ్యాను. అయినా, ఐపీఎస్ కలను వదల్లేదు. నాల్గో ప్రయత్నంలో నాకు ఐపీఎస్ వచ్చింది. నాన్న ఎయిర్‌ఫోర్స్‌లో పనిచేయడం.. మొదటి నుంచి ఎంతో క్రమశిక్షణతో పెరగడంతో ఇక్కడి ట్రైనింగ్ కష్టంగా అనిపించలేదు. సులువుగానే శిక్షణ పూర్తి చేశా. ఇక్కడ నేర్చుకున్న విషయాలు వృత్తిగతంగానే కాకుండా వ్యక్తిగతంగా నన్ను ఎంతో మార్చాయి. నాకు తెలంగాణ పోలీసులో మహేశ్ భగవత్ ఇన్‌స్పిరేషన్. ఐపీఎస్ అధికారిగా నేను మహిళా భద్రతకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తాను. నేను హర్యానాలో పుట్టిపెరిగాను. అక్కడి పరిస్థితులు చూశాక..మహిళా భద్రతకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నా.

– నాగోజు సత్యనారాయణ, స్టేట్ క్రైమ్ రిపోర్టర్, సాక్షి, హైదరాబాద్
ఫొటోలు : ఏ. జాన్

● నయా వంచన | డిజిటల్ మోసాలు

పండగ రోజులు కదా...
ఎర వేస్తారు!

స్టే స్మార్ట్ స్టే సేఫ్



పండగ కదా.... ఆన్‌లైన్ షాపింగ్ ప్రయత్నాలలో ఉన్నప్పుడు 'ఫ్రీ దీపావళి గిఫ్ట్' అంటూ పాపప్ కనిపించవచ్చు. 'ఈ ప్రశ్నలకు జవాబు చెప్పి దీపావళి బహుమతులు గెలుచుకోవచ్చు' అనే ప్రకటన మెరుపులా మెరియవచ్చు.

దీపావళిని పురస్కరించుకొని దుస్తుల నుంచి వస్తువుల వరకు ఆన్‌లైన్ షాపింగ్ ఊపందుకుంటుంది. ఈ నేపథ్యంలో ఆన్‌లైన్ మోసగాళ్లకు చేతినిండా పనే!

పండగ రోజుల్లో ఆన్‌లైన్ స్కామ్‌లు ఎక్కువగా జరగడానికి అవకాశం ఉంది. నకిలీ ఈ-మెయిల్స్, టెక్ట్స్, కాల్స్ ద్వారా స్కామ్‌లు జరుగుతుంటాయి. ఈ పండగ సీజన్‌లో మోస్ట్ కామన్ స్కామ్... నకిలీ ఆర్డర్ లేదా అకౌంట్. మీ అకౌంట్ తాత్కాలికంగా నిలిపివేయబడిందని, ఆర్డర్‌కు పేమెంట్ వెరిఫికేషన్ అవసరమని పేర్కొంటూ హానికరమైన లింక్‌లను క్లిక్ చేసేలా, వ్యక్తిగత వివరాలు షేర్ చేసే విధంగా కస్టమర్‌లను ప్రేరేపిస్తారు.

'గత సంవత్సరం 55,000 ఫిషింగ్ వెబ్‌సైట్‌లను, 12,000 స్కామ్ ఫోన్ నంబర్లను బ్లాక్ చేశాం. పండగ సీజన్ ముందు ఆన్‌లైన్ స్కామ్‌లపై వినియోగదారులకు అవగాహన కలిగించడానికి ఇండియన్ సైబర్ క్రైమ్ కో ఆర్డినేషన్ సెంటర్‌తో కలి పనిచేశాం' అన్నారు అమెజాన్ ఇండియా, వైస్ ప్రెసిడెంట్ (లీగల్) రాకేష్ బక్షీ.

'స్కామర్‌లు నకిలీ షాపింగ్ వెబ్‌సైట్‌లను లేదా అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లాంటి ప్రసిద్ధ బ్రాండ్‌లను అనుసరించి ఆన్‌లైన్ ప్రకటనలను సృష్టిస్తారు. నమ్మశక్యం కాని డిస్కౌంట్‌లతో ఆకట్టుకునే ప్రయత్నం చేస్తారు. పరిమిత కాల ఆఫర్‌లతో కస్టమర్‌లను ఆకర్షిస్తారు. ఒక కస్టమర్ ఆర్డర్ చేసి చెల్లింపు చేసిన తర్వాత నకిలీ ప్రొడక్ట్స్ అందుతాయి. అసలు ఏమీ అందకపోవచ్చు కూడా. నకిలీ వెబ్‌సైట్‌లు తరచుగా అధికారిక బ్రాండ్ లోగోలు, ప్రొడక్ట్ ఇమేజ్‌లను, చట్టబద్ధమైన సైట్‌లను తలపించేలా పాలిష్ చేసిన డిజైన్‌లను ఉపయోగిస్తాయి. కొందరు నిజమైన వెబ్‌సైట్‌ల లేఅవుట్, డొమైన్ పేరును కూడా క్లోన్ చేస్తారు. తేడాను గుర్తించడం కష్టంగా ఉంటుంది' అంటున్నారు సైబర్ సెక్యూరిటీ ఎక్స్‌పర్ట్ శుభంసింగ్.

చాలామంది స్కామర్‌లు ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లాంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో ఫేక్ 'గివ్ అవే' పోటీలు లేదా లక్కీ డ్రాల గురించి పోస్ట్ చేస్తారు. మీ బ్యాంక్ వివరాలను షేర్ చేయమని లేదా క్లెయిమ్ యువర్ ప్రైజ్ లింక్‌పై క్లిక్ చేయమని అడగవచ్చు. వ్యక్తిగత, ఆర్థిక సమాచారాన్ని ఎప్పుడూ షేర్ చేయవద్దు.

అనుమానాస్పద ఎకౌంట్‌ల గురించి వెంటనే రిపోర్ట్ చేయండి. బ్లాక్ చేయండి. బ్యాంక్ స్టేట్‌మెంట్‌లను క్రమం తప్పకుండా తనిఖీ చేసుకోండి.

స్త్రీ హెల్త్‌పై దృష్టిపెట్టాలి


కృతిసనన్

చలం, అంబేద్కర్‌ల నుంచి నటి, ఐక్యరాజ్యసమితి పాపులేషన్ ఫండ్ (యూఎన్ఎఫ్‌పీఏ) జెండర్ ఈక్వాలిటీకి ఈ దేశపు రాయబారి కృతిసనన్ దాకా అందరి మాటా ఒకటే స్త్రీ ఆరోగ్యమే దేశ భవిష్యత్ భాగ్యం అని!

నిజానికి మహిళా ఆరోగ్యం, లింగ సమానత్వం గురించి మాట్లాడుకోవడానికి ప్రత్యేక సందర్భం అక్కర్లేదు.. అయినా ఈ ప్రస్తావనకు ప్రత్యేక సందర్భమూ ఉంది. అదే బెర్లిన్ (జర్మనీ)లో జరిగిన వరల్డ్ హెల్త్ సమ్మిట్ 2025. ఇందులో ఆమె మహిళల ఆరోగ్యం మీద శ్రద్ధ పెట్టాల్సిన అవసరం గురించి మాట్లాడారు. ఇలా వరల్డ్ హెల్త్ సమ్మిట్‌లో ప్రసంగించిన తొలి భారతీయ నటిగా కీర్తి గడించారు. ఆ ప్రసంగంలో కీర్తి సనన్ ఏం మాట్లాడారంటే..

'మహిళల ఆరోగ్యం నిర్లక్ష్యం చేయాల్సిన లేదా పక్కన పెట్టాల్సిన విషయం కాదు. తక్షణమే దృష్టిపెట్టాల్సిన అత్యంత అవసరమైన అంశం. ఆమె ఆరోగ్యం.. మానవాళి ప్రగతికి, భవిష్యత్‌కు మూల స్తంభం. అందుకే మహిళా ఆరోగ్యానికి సంబంధించి సుస్థిరమైన పెట్టుబడులు కావాలి. ఆవిష్కరణలు జరగాలి. ఇందుకోసం చేసే ప్రతి ప్రయత్నం అద్భుతమైన ఆర్థిక, సామాజిక మార్పులుగా ప్రతిఫలిస్తుంది. ఏటా ముప్పై కోట్లు ఇన్వెస్ట్ చేస్తే పదమూడు వందల కోట్ల రాబడి కనిపిస్తోంది. అంటే దాదాపు తొమ్మిది రెట్ల లాభం. ఈ ఇన్వెస్ట్‌మెంట్ నైతికావసరమే కాదు మన ముకుమ్మడి భవిష్యత్‌కు భరోసా కూడా! ఎందుకంటే మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబాలు, సమాజం.. ఆరోగ్యంగా ఉంటాయి. ఆరోగ్యవంతమైన సమాజం ఆర్థిక సుస్థిరతకు చిహ్నం. కానీ ప్రపంచ జనాభాలో సగంగా ఉన్న మహిళల ఆరోగ్యం ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురవుతూనే ఉంది. యూఎన్ఎఫ్‌పీఏ జెండర్ ఈక్వాలిటీ అంబాసిడర్‌గా చాలా ప్రాంతాలు తిరిగాను. అవన్నీ కూడా బాల్యవివాహాలకు సాక్ష్యంగా కనపడ్డాయి. అమ్మాయిలకు మానసిక ఆరోగ్యం సంగతి అటుంచి కనీసం శారీరక ఆరోగ్య కేంద్రాలు కూడా అందుబాటులో లేని దుస్థితిలో ఉన్నాయి. వీళ్ల జీవితాలు మారాలంటే మహిళల ఆరోగ్యానికి సంబంధించి దృష్టి పెరగాలి. తక్షణమే ఆ దిశగా కార్యాచరణ నిర్ణయాలు జరగాలి' అన్నారు కృతిసనన్.

ఫ్యాషన్

పండగలకు, సంప్రదాయ వేడుకలకూ నిండైన హుందాతనాన్ని తీసుకువచ్చేలా కట్టూ బొట్టు విషయంలో అతివలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటారు. ఈ దీపావళి వేళ మరింత స్పెషల్‌గా కనిపించాలనుకునే వారికోసం బెంగాలీ చీరకట్టు ఆధునికతనూ అద్దుకొని కొంగొత్తగా మెరిసిపోతుంది. సెలబ్రిటీలూ ముచ్చటపడే ఈ కట్టుకు వారు జోడించే హంగులు ఇవి...

పండగంతా నిండుగా...

పండగలు, ఇతర సంప్రదాయ వేడుకలలో బెంగాలీ స్టైల్ చీర కట్టును దేశవ్యాప్తంగా మహిళలు ధరించడానికి ఇష్టపడుతున్నారు. ఉత్తేజాన్ని కలిగించే ఎరుపు–తెలుపు కాంబినేషన్‌లో ఉండే ఈ చీర కట్టు, నుదుటన పెద్ద బిందీ, శంఖం ఆకృతిలో నెక్ డిజైన్, చీర పల్లూకున్న అందమైన డిజైన్.. ఇవన్నీ పండుగను మరింత ప్రత్యేకంగా చేస్తాయి. దుర్గాపూజల సమయాల్లో ఈ రంగు చీరలను బెంగాలీలు ప్రత్యేకంగా ధరిస్తారు. ఆ స్టైల్ కట్టును ఇప్పుడు లక్ష్మీ పూజలు, వివాహ వేడుకల సమయాల్లో ధరించడానికి ఆసక్తి చూపుతున్నారు. అయితే, ఈ కట్టును మనం అనుసరించాలంటే మాత్రం ఈ సూచనలు తప్పక అవసరం.









హెయిర్ స్టైల్- మేకప్
హెయిర్ స్టైల్ కోసం ఒక బన్ తయారు చేసి, దానిని మల్లె పువ్వులు లేదా ఎరుపు, తెలుపు పువ్వులతో అలంకరించవచ్చు. పువ్వులతో కాకున్నా హెయిర్ బన్‌కు హెయిర్ పిన్ జ్యువెలరీని జోడించడం ద్వారా అందాన్ని పెంచుకోవచ్చు. మేకప్ కోసం ఎరుపు లిప్‌స్టిక్, తేలికపాటి ఐ మేకప్ సరిపోతాయి. ధరించిన చీరకు మేకప్ సెట్ అవుతుందా అనేది సరి చూసుకుంటే చాలు. మెడలోనూ, చేతులకు ఎక్కువ నగల లేకుండా చూసుకుంటే చాలు. మీ రూపం ఆధునికతను అద్దుకున్న సంప్రదాయంతో కొంగొత్తగా మెరిసిపోతుంది.

ఎంపికలో సరైన చీర
పూజలు, నోములు, వ్రతాల సమయంలో ఎరుపు అంచుతో ఉన్న తెలుపు లేదా ఆఫ్-వైట్ బేస్ చీరను ఎంచుకోవాలి. అంచు ఉన్న కాటన్, పట్టు లేదా టస్సర్ చీరలు ఈ బెంగాలీ లుక్‌కు సరైనవి. వీటిలో మనవైన చేనేతలు కూడా ఉండవచ్చు. ఈ చీరకట్టు సౌకర్యంగా ఉండటమే కాకుండా పూజ, పండగల సమయాల్లో రోజంతా ధరించడం సులభం కూడా.

కట్టుతో కట్టడి
బెంగాలీ స్టైల్‌లో నిజమైన ఆకర్షణ దాని డ్రేపింగ్ శైలిలోనే ఉంటుంది. చీర కుచ్చిళ్ల నుంచి ఎడమ వైపుగా, పొడవాటి పల్లూను ఛాతీ మీదుగా భుజం వరకు తీసుకుంటూ వెళ్లాలి. పొడవాటి పల్లూ భాగాన్ని కుడి చేతి భుజం కిందుగా తీసి, పైకి అంచు భాగం కనిపించేలా బ్లౌజ్‌కు జత చేయాలి. పొడవుగా తీసుకున్న కొంగు భాగాన్ని కుడి చేత్తో ముందుకు తీసుకువచ్చి పట్టుకోవడం కూడా ఈ కట్టులో అందంగా కనిపిస్తుంది. భుజం మీదుగా తీసిన పల్లూని కొప్పుకు అటాచ్ చేసి, ఎడమ భుజం కిందుగా తీసుకురావచ్చు. ఈ కట్టు లలనల రూపాన్ని మరింత సంప్రదాయంగా మారుస్తుంది. డ్రేపింగ్ చేసేటప్పుడు, కుచ్చుల భాగం మడతలు లేకుండా సెట్ చేసి, పల్లూ చాలా తేలికగా ఉన్నట్టు చూసుకోవాలి.

నగలపై ప్రత్యేక శ్రద్ధ
పెద్ద పెద్ద చెవిపోగులు, గాజులు, నెక్లెస్‌లు ఈ స్టైల్ చీరకట్టుకు రాయల్ టచ్‌ను జోడిస్తాయి. హెవీగా ఆభరణాలు అక్కర్లేదు అనుకుంటే పెద్ద చెవిపోగులు, గాజులు ఈ అలంకరణకు సరిపోతాయి.

గుండ్రని వెడల్పాటి బిందీ
బెంగాలీ స్టైల్ డ్రేపింగ్ సంపూర్ణం కావాలంటే నుదుటన పెద్ద, గుండ్రని ఎరుపు బిందీ తప్పక ఉండాలి. ఇది పండుగల రోజుల్లో మొత్తం మేకప్‌ను పూర్తి చేస్తుంది. నుదుటిపై బిందీతో పాటు సిందూర్ చుక్కలను కూడా అదనంగా పెట్టడం వల్ల లుక్ మరింత మెరుగవుతుంది. ఈ లుక్‌కి ఎరుపు లేదా ముదురు గులాబీ రంగు బిందీ ఆకర్షణీయంగా కనిపిస్తుంది.

● టెక్నాలజీ

ఇంటిపని నుంచి తోటపని వరకు...
ఫిగర్ వో 3





'ఫిగర్ ఏఐ' అనేది హ్యూమన్ రోబోలకు సంబంధించిన స్టార్టప్. తాజాగా 'ఫిగర్ వో 3' అనే హ్యూమన్ రోబో గురించి ప్రకటించింది కంపెనీ. 'రోజువారీ అవసరాలకు ఉపయోగపడే సాధారణ హ్యూమనాయిడ్ రోబో ఇది. గదిని శుభ్రం చేయడం, మొక్కలకు నీళ్లు పెట్టడం, ఆహారాన్ని వడ్డించడం, గిన్నెలు కడగడం, బట్టలు మడత పెట్టడం...మొదలైన ఎన్నో పనులు చేస్తుంది' అని 'ఫిగర్ వో 3' వివరాలు వెల్లడి చేసింది కంపెనీ. కాలిఫోర్నియాకు చెందిన 'ఫిగర్ ఏఐ' స్టార్టప్ మునుపటి తరం హ్యూమనాయిడ్‌లతో పోల్చితే సరికొత్త, సాంకేతికంగా ఒక అడుగు ముందుండే హ్యూమనాయిడ్స్ దృష్టి పెట్టింది. పూర్తిగా రీడిజైన్ చేసిన సెన్సరీ సూట్, హ్యాండ్ సిస్టమ్, నెక్ట్స్ జనరేషన్ విజన్ సిస్టమ్‌తో ఈ సరికొత్త హ్యూమనాయిడ్ రోబో మార్కెట్‌లోకి అడుగు పెట్టనుంది.

బులియన్
బంగారం 10 గ్రా.: వెండి కిలో
అక్టోబర్ 16న ముగింపు రూ.లలో

హైదరాబాద్		విజయవాడ		విశాఖపట్నం		రాజమండ్రి		ప్రొద్దుటూరు		చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	1,31,900	బంగారం (24 క్యారెట్లు)	1,31,320	బంగారం (24 క్యారెట్లు)	1,29,440	బంగారం (24 క్యారెట్లు)	1,31,320	బంగారం (24 క్యారెట్లు)	1,31,300	బంగారం (24 క్యారెట్లు)	1,29,810
బంగారం (22 క్యారెట్లు)	1,22,790	బంగారం (22 క్యారెట్లు)	1,18,650	బంగారం (22 క్యారెట్లు)	1,18,650	బంగారం (22 క్యారెట్లు)	1,22,210	బంగారం (22 క్యారెట్లు)	1,20,800	బంగారం (22 క్యారెట్లు)	1,19,000
వెండి	1,90,000	వెండి	1,82,900	వెండి	2,06,000	వెండి	1,82,900	వెండి	1,80,000	వెండి	2,06,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.